## అశాస్త్రీయంగా బీసీ కులగణన సర్వే



నిజాంపేట, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన బీసీ కులగణన సర్వే అశాస్త్రీయంగా ఉంది. రాజ్యాధికారంలో బీసీలను భాగస్వాములను చేద్దామనే ఆలోచన సీఎం రేవంత్‌రెడ్డికి లేకనే, కులగణన సర్వేలో బీసీల జనాభా తగ్గించి చూపించారు. కామారెడ్డి డిక్లరేషన్ హామీ మేరకు త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. తప్పుల తడకగా కాకుండా బీసీ కుల గణన సర్వే కొత్తగా చేపట్టాలి.

**- మావురం రాజు, బీసీ, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు, నిజాంపేట**

## బీసీలను అణచి వేసేందుకు యత్నం



టేక్మాల్, ఫిబ్రవరి 6: రాష్ట్ర జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలను అణగదొక్కేందుకు రేవంత్ సర్కార్ యత్నిస్తున్నది. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సీఎం, బీసీలకు అన్యాయం చేస్తున్నారు. కేసీఆర్ హయాంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు, ఇప్పటి సర్వేకు పొంతనేలేదు. బీసీ ఓట్లతో గెలుపొందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు వారికి జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించకపోవడం సిగ్గుచేటు. బీసీలకు చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలి.

**- నాయికోటి భాస్కర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి, టేక్మాల్**

## కావాలనే తక్కువ చూపారు



అల్లాదుర్గం, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే బీసీ జనాభాను తగ్గించి చూపే ప్రయత్నం చేసింది. సర్వే పూర్తిగా తప్పుల తడకగా ఉంది. గతంలో కన్నా ఇప్పుడు బీసీలు ఎలా తగ్గుతారో ప్రభుత్వం స్పష్టం చేయాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల లెక్క పక్కాగా తేలింది. కేసీఆర్ పాలనలో బీసీలకు సముచిత స్థానం దక్కింది. ఎట్టి పరిస్థితుల్లో ఈ కుల గణనను ఒప్పుకోం. వెంటనే మళ్లీ పారదర్శకంగా బీసీ కుల గణన చేయాలి.

**- అంజియాదవ్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు**

## సమగ్ర లెక్కలు తీయాలే



రేగోడ్, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన పూర్తిగా తప్పుల తడకగా ఉంది. ప్రభుత్వం సమగ్రంగా లెక్కలు తీయాలి. ఎవరెవరు ఎంత శాతం ఉన్నారో ప్రకటించాలి. కుల గణనతో బీసీలకు నష్టం జరుగుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తున్నది. బీఆర్ఎస్ హయాంలో 52 శాతం ఉన్న బీసీలను కాంగ్రెస్ 46 శాతంగా చూపెడుతున్నది. ఓసీ జనాభా ఎక్కువగా, బీసీలను తక్కువగా చూపెట్టడం పెద్దకుట్ర. బీసీలకు 42 శాతం సీట్లు ఇస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు మాటమార్చింది. రిజర్వేషన్ ప్రకారం సీట్లు ఇవ్వాలి. బీసీ జనాభా ఏ కారణంగా తగ్గిందో ప్రజలకు చెప్పాలి.

**- సంతోష్ పాటిల్, బీఆర్ఎస్ నాయకుడు, రేగోడ్**

## బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



చిలిపిచెడ్, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కున గణన పేరిట ఆ వర్గాలను మోసం చేసింది. పూర్తిస్థాయిలో సర్వే చేయకుండానే కుల గణన పూర్తయ్యిందని చెప్పడం విడ్డూరంగా ఉంది. కుల గణనలో తప్పుల తడకగా ఉంది. కేవలం 42 శాతం బీసీలు ఉన్నట్లు పేర్కొనడం వెనుక అంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. దాదాపు 60శాతానికి పైగా బీసీలు ఉంటారు. అసెంబ్లీలో ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారం బీసీ జనాభా భారీగా తగ్గిందని, ఓసీ జనాభా పెరిగిందని చూపించారు. బీఆర్ఎస్ చేపట్టిన ఇంటింటి సర్వేను పక్కన పెట్టి కొత్తగా సర్వే చేశామని చెప్పి బీసీ ప్రజలను మళ్లీ మోసం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నది.

**- బెస్త లక్ష్మణ్, మాజీ సర్పంచ్, సోమక్కపేట**

### డిగ్రీ కళాశాలకు భవనం

## మంజూరు చేయాలని రాస్తారోకో



పెద్దచింతకుంట జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

నర్సాపూర్, ఫిబ్రవరి 6: కౌడిపల్లి మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల భవనాన్ని మంజూరు చేయాలని విద్యార్థులు మండలంలోని పెద్దచింతకుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం రాస్తారోకో చేశారు. విద్యార్థులు మాట్లాడుతూ కౌడిపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ కళాశాలలో తరగతులు నడిపించుకోమని ఉన్నత విద్యా శాఖ నుంచి అనుమతులు వచ్చినా ప్రిన్సిపాల్ అవకాశం ఇవ్వడం లేదని మండిపడ్డారు. భవనం లేకపోవడంతో రోజుకు రూ.150 చార్జీలు పెట్టుకొని పెద్దచింతకుంట డిగ్రీ కళాశాలకు విద్యాభ్యాసానికి వస్తున్నామన్నారు.

## తాగునీటి సమస్య లేకుండా చర్యలు



బండపోతుగల్‌లో నీటి నల్లాను పరిశీలిస్తున్న అధికారులు

చిలిపిచెడ్, ఫిబ్రవరి 6: వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) ఎస్ఈ రఘువీరా పేర్కొన్నారు. గురువారం మండలంలోని బండపోతుగల్, ఫైజాబాద్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి రోజూ ప్రతి ఇంటికి నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా పైపులకు లీకేజీలు ఉంటే మరమ్మతులు చేయాలని, ట్యాంకులు శుభ్రం చేసి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఈలు ప్రవీణ్, శ్రీనివాస్, ఏఈలు సురేశ్, అన్వేష్, సూపర్‌వైజర్ నవీన్, గ్రామ కార్యదర్శులు ఆనంద్, నాగరాజు ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మెదక్‌రూరల్, ఫిబ్రవరి 6: మెదక్ మండలంలోని మంబోజిపల్లిలో ఇటీవల మేకల మల్లేశం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి స్థానిక నాయకుల ద్వారా బాధిత కుటుంబానికి రూ.5 వేల సాయం అందజేశారు.

# డంప్ యార్డు రద్దు చేసే వరకు ఉద్యమిస్తాం

- గతంలో ప్రజా శ్రేయస్సు కోసం అనుమతులు రద్దు చేశాం
- మరి ఇప్పుడెందుకు ఏర్పాటు చేస్తున్నారు
- అప్పుడు వ్యతిరేకించిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడెటుపోయారు
- డంప్ యార్డ్‌తో అటవీ, పంటలకు తీవ్ర నష్టం
- రాయారావు చెరువు కలుషితం అవుతుంది
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



నర్సాపూర్: పట్టణంలో రాస్తారోకోతో చేస్తున్న అఖిలపక్షం నాయకులు





నర్సాపూర్: రాస్తారోకోలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



నర్సాపూర్ పట్టణంలోని రాయారావు చెరువు

నర్సాపూర్, ఫిబ్రవరి 6: గుమ్మడిదల మండలం ప్యారానగర్ సమీపంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డును రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హెచ్చరించారు. గురువారం నర్సాపూర్‌లో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డు ఏర్పాటును నిరసిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో చేసి, ధర్నా నిర్వహించారు. అఖిలపక్షం పిలుపు మేరకు నర్సాపూర్‌లోని వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లోని అటవీ ప్రాంతం 152 ఎకరాల భూమిలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నదన్నారు. ఈ అడవిలో కురిసే ప్రతి వర్షం నీటి చుక్క నర్సాపూర్ రాయారావు చెరువులోకి చేరుతుందన్నారు. డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే చెరువు నీళ్లు పూర్తిగా కలుషితం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో చెరువు కింద వేల ఎకరాల సాగు భూమి కాలుష్యం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతారని మండిపడ్డారు.

### ఎన్నో అభివృద్ధి పనులు చేశాం

ఇప్పటికే రాయారావు చెరువును బ్యూటిఫికేషన్ చేశామని, బోటింగ్, పర్యాటకులకు హోటల్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామన్నారు. డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే నీరు పూర్తిగా కలుషితమై పర్యాటకులు రావడం తగ్గుతారని ఆవేదన వ్యక్తం చేశారు. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి, ప్యారానగర్, నాగిరెడ్డిగూడెం తదితర గ్రామాల రైతులు కూరగాయలు పండిస్తారని, డంపింగ్ యార్డుతో వారికి నష్టం చేకూరుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు డంపింగ్ యార్డుకు అనుమతులు వచ్చినా కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకించడంతో ప్రజలు, రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని అప్పటి మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ నిలిపేశారన్నారు. అప్పుడు గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడెందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం డంపింగ్ యార్డు ఏర్పాటుకు పూనుకుంటే మౌనంగా ఉన్నారని విమర్శించారు. డంపింగ్ యార్డు ఏర్పాటుతో అడవి, పంటలు, రైతులు, ప్రజల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుండిగల్ ఎయిర్ పోర్ట్ వాళ్లు కూడా స్పందించాలన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ డంప్‌యార్డ్ నిర్మించొద్దని, తక్షణమే నిలిపేయాలని డిమాండ్ చేశారు. అటవీ శాఖ కూడా దీనికి సంబంధించిన అనుమతులు రద్దు చేయాలని కోరారు.

### అఖిలపక్షంతో కలిసి పోరాడుదాం

డంప్‌యార్డ్ నిలిపి వేసే వరకు అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాడుతామని, రైతులను కాపాడుకుంటామని తెలిపారు. ఈ పోరాటానికి కలిసి వచ్చిన అఖిలపక్షం బీజేపీ, సీపీఐ, సీపీఎం నాయకులను అభినందించారు. ఇదే ఐక్యతతో ముందుకు సాగాలని, ఈ పోరాటంలో కాంగ్రెస్ నాయకులు కూడా కలిసి రావాలని కోరారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సింగాయిపల్లి గోపి, సంతోష్‌రెడ్డి, సత్యంగౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, సీపీఐ నాయకుడు ఖాలేఖ్, మాజీ వైస్ ఎంపీపీ నర్సింగరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల జాతరకు కార్యాచరణ తయారు చేయాలి

- పార్కింగ్ నియంత్రణపై శాశ్వత పరిష్కారానికి చర్యలు
- కలెక్టర్ రాహుల్‌రాజ్





కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



కొల్చారంలో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

మెదక్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): ఏడుపాయల ఆలయ పార్కింగ్ నియంత్రణపై శాశ్వత పరిష్కారానికి పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏడుపాయల ఆలయం పార్కింగ్ నియంత్రణకు శాశ్వత పరిష్కారం, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జాతర నిర్వహణకు శాఖల వారీగా కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏడుపాయల వనదుర్గ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు తండోపతండాలుగా వస్తారని, పార్కింగ్ నియంత్రణ కష్టతరమవుతున్నదని అన్నారు. ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక చేయాలని అధికారులు ఆదేశించారు. అనంతరం మహాశివరాత్రి సందర్భంగా ఏడుపాయల జాతర నిర్వహణ, ఏర్పాట్లపై శాఖల వారీగా కార్యక్రమాలపై సమగ్ర కార్యాచరణ తయారు చేసి, సోమవారం లోగా అందజేయాలని ఆదేశించారు. నివేదికలను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, డీఆర్వో భుజంగరావు, ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ఎరువులు అందుబాటులో ఉండాలి

కొల్చారం, ఫిబ్రవరి 6: రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆయన కొల్చారంలో పర్యటించారు. వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల దుకాణాన్ని పరిశీలించారు. అందుబాటులోని యూరియా నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న కోతుల చెరువు వద్ద ఓ రైతు వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ఆన్‌లైన్ క్రాప్ బుకింగ్ విధానాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఏఓ శ్వేతా కుమారి, సొసైటీ చైర్మన్ నాగూరి మనోహర్, సీఈవో కృష్ణ, ఏఈఓలు ఉన్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్న తహసీల్దార్

వెల్దుర్తి, ఫిబ్రవరి 6: వెల్దుర్తి శివారు హల్దీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైస్‌మిల్ వెనకభాగంలో ఉన్న పానాది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, పోలీస్ సిబ్బందితో వెళ్లి, ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. వాగు సమీపంలో డంపు చేసిన సుమారు పది ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. బుధవారం మండలంలోని హస్తాల్‌పూర్‌లో పగటి వేళలో భారీగా ఇసుకను తరలిస్తున్న విషయం అధికారులకు తెలిసిన పట్టించుకోలేదని, రాత్రి వేళల్లో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు తరలిస్తున్నా చూసీచూడనట్లు వ్యవరిస్తున్నారని ఆరోపించారు. ఇసుకను తరలిస్తే అధికారులు అప్పుడప్పుడు పట్టుకుంటున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం రాత్రి వేళలో ఇసుక తరలిస్తుండగా రైతులు పట్టుకొని పోలీసులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదని వాపోయారు.

## కేంద్ర బడ్జెట్‌లో ప్రజా సంక్షేమానికి నిధులు కేటాయించలేదు

**- రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరి**



సమావేశంలో మాట్లాడుతున్న గౌరి

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 6: కేంద్ర బడ్జెట్‌లో కార్మిక, రైతు, ప్రజా సంక్షేమానికి నిధులు కేటాయించలేదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరి మండిపడ్డారు. గురువారం జిల్లా కేంద్రం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గౌరి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రైతులు, కార్మికులు, ప్రజలను పూర్తిగా విస్మరించిందన్నారు. కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా బడ్జెట్ ఉందన్నారు. తెలంగాణ నుంచి ఎమినిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.12వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడి వరకు ఇవ్వకపోవడం ఘోరమన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు మల్లేశం, బస్వరాజు, నరేందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి నివారణపై అవగాహన



కుష్టు వ్యాధి నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రామాయంపేట, ఫిబ్రవరి 6: కుష్టు వ్యాధి నివారణపై రామాయంపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కుష్టువ్యాధి రాకుండా విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.

## బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



నిజాంపేట, ఫిబ్రవరి 6: కల్వకుంటకు చెందిన దుద్దెడ రేఖకు రూ.60 వేలు, నందగోకుల్ గ్రామానికి చెందిన లింగయ్య రూ.11 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరైనవి. గురువారం స్థానిక నాయకులు బాధితులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మసూద్‌అలీ,మోహన్‌రెడ్డి, స్వామి,కుమార్,భాస్కర్ గౌడ్,నర్సింహులు ఉన్నారు.

## చిట్కుల్‌లో వైద్య శిబిరం



శిబిరంలో ప్రజలకు వైద్యం చేస్తున్న డాక్టర్లు

చిలిపిచెడ్, ఫిబ్రవరి 6: చిట్కుల్‌లో హోలిస్టిక్ దవాఖాన కుకట్‌పల్లి హైదరాబాద్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. తారా విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఉచిత వైద్యం అందించారు. ఈ శిబిరంలో 150 మందికి వైద్యం చేసి, ఉచితంగా మందులు పంపిణీచేశారు. కార్యక్రమంలో డాక్టర్లు నివాస్, లక్ష్మీనారాయణ, జయరాజ్, ఈశ్వరీస్, కీర్తన, గోపి పాల్గొన్నారు.

## విద్యార్థులకు డిక్షనరీలు అందజేత



పాపన్నపేట, ఫిబ్రవరి 6: మండలంలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో శ్రీరామచంద్ర సేవా సమితి దేవదత్తు ఆధ్వర్యంలో వి ద్యార్థులకు డిక్షనరీలు అం ద జేశారు. కార్యక్రమంలో ట్రస్టుసభ్యులు ఉన్నారు.

## ఓ ఇంట్లో మృతదేహం లభ్యం

తూప్రాన్, ఫిబ్రవరి 6: పట్టణంలోని ఓ ఇంట్లో కుళ్లి పోయిన స్థితిలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు.తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం ఎస్సీ కాలనీకి చెందిన వడియారం మల్లేశం(48) తాగుడుకు బానిసయ్యాడు. కుటుంబ కలహాల కారణంగా కొద్ది రోజులుగా మల్లేశం భార్య జ్యోతి, కుమారుడు శ్రావణ్‌తో కలిసి ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. గురువారం మల్లేశం ఉంటున్న ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు ద్వారా సమాచారమందుకున్న జ్యోతి స్థానికుల సహాయంతో తలుపులు పగల గొట్టి చూడగా మల్లేశం మృతి చెంది ఉన్నాడు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

## జాతరకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



జాతరకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



రాములు కుటుంబానికి పరామర్శ

కౌడిపల్లి, ఫిబ్రవరి 6: కౌడిపల్లిలో గోకుల్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ వరకు 6 రోజుల పాటు నిర్వహించే జాతరకు రావాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డికి గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు.

### బాధిత కుటుంబానికి ఓదార్పు

కౌడిపల్లి గ్రామానికి చెందిన మద్దెల రాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట మాజీ వైస్ ఎంపీపీ నవీన్‌గుప్తా, మాజీ సర్పంచ్ బీస కాంత పురుషోత్తం, సీడీసీ మాజీ చైర్మన్ దుర్గారెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, రాజిరెడ్డి, రుద్రప్ప, మనోహర్‌రెడ్డి, పోల నవీన్‌కుమార్, సందీప్, రమేశ్, నవీన్, పలువురు నాయకులు ఉన్నారు.

## ఫైరింగ్ ప్రాక్టిస్ చేస్తున్న పోలీస్ అధికారులు



ఫైరింగ్ ప్రాక్టిస్‌లో పాల్గొన్న ఎస్పీ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 6: జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి ఫైరింగ్ శిక్షణ ఇచ్చి ఫైరింగ్ ప్రాక్టిస్ చేయించినట్లు ఎస్పీ ఉదయ్‌కమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు సిద్దిపేట్ జిల్లాలోని రాజ్‌గోపాలపేట్‌లోని ఫైరింగ్ రేంజ్‌లో వార్షిక శిక్షణలో భాగంగా జిల్లాలో పనిచేస్తున్న సిబ్బందికి ఇచ్చే ఫైరింగ్ శిక్షణను ఎస్పీ సందర్శించారు. సిబ్బందికి ఇచ్చే ఫైరింగ్ శిక్షణను పర్యవేక్షించారు. అనంతరం ఎస్పీ ఫైరింగ్ ప్రాక్టిస్ చేసినట్లు పేర్కొన్నారు.

## కూరగాయల పంటకు నిప్పు



డి.ధర్మారంలో కూరగాయల పంటకు నిప్పుపెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

రామాయంపేట, ఫిబ్రవరి 6: మండలంలోని డీ.ధర్మారంలో ఓ రైతుకు చెందిన కూరగాయల పంటకు గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి నిప్పుపెట్టారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌలురైతు పిట్టల రాజు తమ పొలంలో కూరగాయలు పండిస్తున్నాడు. రాత్రి గ్రామ శివారులోని పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు పంటకు నిప్పు పెట్టారు. దీంతో పొలంలోని డ్రిప్పు పైపులన్నీ కాలిబూడిదయ్యాయి. దీంతో రైతు రాజుకు సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ విషయంలో రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతు రాజు తెలిపాడు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## 23 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

పాపన్నపేట, ఫిబ్రవరి 6: పాపన్నపేట మండలం నార్సింగ్‌లోని ఓ రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన 23 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులు పట్టుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. నార్సింగ్‌లో ఉచిత బియ్యం నిల్వ ఉంచినట్లు సమాచారం మేరకు సివిల్ సప్లయిస్ అధికారులు దాడి చేసి పంచనామా చేసి బియ్యం సీజ్ చేసినట్లు తెలిపారు.

## వివాహానికి ఆర్థిక సహాయం అందజేత

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 6: మండలంలోని ఖాజాపూర్‌కు చెందిన నరసవ్వ, సిద్దిరాములు కుమార్తె వివాహం గురువారం జరిగింది. బీఆర్ఎస్ నాయకుడు తిరుపతిరెడ్డి, రూ.5వేల ఆర్థిక సాయాన్ని నాయకులు శ్యాం, జగన్ ద్వారా అందించారు. గ్రామానికి చెందిన నరేశ్ బియ్యం, నర్సింలు రూ.2వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**LOST**

I, SHAIKH KHADER PASHA, S/o. Ibrahim, R/o. H.No. 8-55, Beerappa Basti, Bollaram, Jinnaram Mandal, Sangareddy (D), TS-502 325, have Lost My Passport bearing No: P1173816, while travelling from Bollaram to Bachupally. Anybody found, pls. Contact: 9346240121